
# భానుమతీ రామకృష్ణ

## కట్టే కొట్టే తెచ్చే



మా యింటికి దగ్గర్లో వున్న డాక్టరుగారి అల్లుడు తొలి సంక్రాంతి పండక్కి భార్యతోసహా మామగారింటికివస్తూ, పెళ్లిలో మామగారు లాంఛనంగా యిచ్చిన టి.వి. సెట్ కూడా తీసుకొచ్చి మామగారి మొఖాన పడేశాడని మా వీధి వీధంతా గుప్పుమన్నది!

"ఏం! ఎందుకని! అల్లుడికి చవకబారు టి. వి. కొనిచ్చాడేమో డాక్టరు!.... లేక చెడిపోతే రిపేరుకి తెచ్చాడేమో అల్లుడు!........ అసలది కలరా! మామూలు 'బ్లాక్ అండ్ వైటు టి. వి.' నా....బహుశా ఇండియన్ కలర్ టి.వి. యిచ్చాడేమో - ఫారిన్‌ది కావాలని తెచ్చి మామగారి మొఖాన పడేసి వుంటాడర్రా!...." అంటూ మా వీధి అమ్మలక్కలు అనుకొనేవన్నీ రోజూ మాకు పూలిచ్చే లక్ష్మి, పూలతోబాటు మా వంట మనిషికీ, పనిమనిషికీ అందజేసి పోతూండేది!

మాపని మనిషికీ వంట మనిషికీ మా యింట్లో కలర్ టి. వి లేదని చాలా నిరుత్సాహంగా పూల లక్ష్మితో డాక్టర్‌గారి అల్లుడు తెచ్చింది కలర్ టి. వి నా అని తెల్సుకోవడానికి వాళ్ళు చూపించే ఉబలాటం వెధవ 'క్యూరియా సిటీ' నాకూ కలిగింది! "ఎవరింటి గోలో మనకెందుకు పోనిద్దూ" అని మా వారు అన్నప్పటికీ ఆడ జన్మకి అదో శాపం- సందేహ నివృత్తి కాందే ఏవనీ తోచదే! వరండాలో మాట్లాడుతున్న పూల లక్ష్మినీ మా పని వాళ్ళనీ చూసి 'ఏమిట్రా డాక్టర్‌గారి అల్లుడి టి. వి. గోల:' అని అడిగాను వాకిట్లోనే నిలబడి .. నన్ను చూడగానే చటుక్కున మా పని వాళ్ళూ, లక్ష్మి షాక్ కొట్టినట్లు లేచి ఖంగారు పడుతూ "అబ్బే ఏం లేదమ్మగారు: ఏం లేదు" అంటూ ఎవరి దోవన వాళ్ళు పోబోయారు. అంతవరకూ పూల లక్ష్మిని డాక్టర్ గారింటి ఆరాలు తీయడానికి నాకు పూలు గూడా యివ్వనివ్వకుండా అమ్మగారు టి. వి. చూస్తున్నారులే అని దాని నోరు నొక్కిన మా పనివాళ్ళు మెల్లిగా పెరటి వేపుకు జారుకోబోయారు. అదే సమయంలో మా టి. వి.లో ఒకావిడ అనౌన్స్ చేసింది మన భారత దేశానికి స్వాతంత్ర్యం సాధించి సంపాదించి పెట్టిన ఆనాటి యోధుల్లో ఒకరైన శ్రీమాన్ దూర్వాసరావు గారు స్వాతంత్ర్య సమరంలో తమ అనుభవాలు మనకు వినిపిస్తారు! అది పూల లక్ష్మి చెవున పడ్డది? 'అదేనమ్మా? యిప్పుడు విన్నారే మన దేశానికి సొతంత్రం ఎట్లొచ్చిందీ ఎవరో ముసలోళ్ళు చెప్తారంటనే ఆ ప్రోగ్రామొస్తే ఆ డాక్టర్ గారల్లుడికి శివం ఎత్తుకొస్తదంట?' 'ఏం! డాక్టరు అల్లుడి తండ్రో తాతో మన దేశానికి స్వతంత్రం ఒచ్చేంముందు జైలు కెళ్ళి అవస్థలు పడ్డారేమో' అన్నాడు మా వంటవాడు. ..అబ్బే 'అదేం కాదంటయ్యా! అసలా ప్రోగ్రాం టి. వి.లో వస్తేనే డాక్టర్ అల్లుడికి మతి పోద్దంట! ఒకసారి ఓర్చుకోలేక రాయి తీసుకొని టి. వి. పగల గొట్టాడంట డాక్టరల్లుడు!' అని పకపకా నవ్వింది లక్ష్మి!

"అదీ సంగతి: రిపేరుకు తెచ్చాడన్న మాట మామగారి దగ్గరికి" అన్నాడు పనివాడు.


"రిపేరూగాదూ పాడూగాదు. మళ్ళీ లక్ష రూపాయలిచ్చినా ఆ టి. వి. మాత్రం తీసుకెళ్ళను అని శపథం చేశాడట." మరి డాక్టరు గారింట్లో టి. వి. వుందిగా అదేం చేస్తాడు!" అన్నాడు వంటవాడు సందేహం వచ్చి!

"ఆ: అదీ చెప్పాడంట. టి.వి. పెడితే పండక్కి మామగారింటికి రానన్నాడంట!- రావాలంటే పెళ్ళాన్ని ఏ సినిమాకో తీసికెళ్ళాగాని ఆ టి.వి. ఆన్‌చేస్తే తాను ఇంట్లో వుండనని కండిషన్ పెట్టి వచ్చాడంట డాక్టర్ అల్లుడు" అని దవడలు నొక్కుకుంది లక్ష్మి. మావాళ్ళ క్యూరియాసిటీ మరీ ఎక్కువైంది. ఆశ్చర్యంగా వుందే ఆ ప్రోగ్రాం నచ్చకపోతే ఆఫ్‌చేసి మరొకటి వచ్చేదాకా ఆగొచ్చు. అసలు టి.వి.నే వద్దనడం తమాషాగావుందే" అన్నారు. "అదొకటేగాదంటయ్యా ఆ ప్రోగ్రాం అవ్వగానే దానెంటనే ఏదో 'పాలూ చేలూ' అనే ప్రోగ్రాం వస్తుందంట. దాని తర్వాత పల్లెటూళ్ళలో ముసలోళ్ళకి చదువు నేర్పించే ప్రోగ్రాం వస్తదంట. దాని తర్వాత ఎవరో పండు ముసల్ది పల్లెటూరి పదాలూ సుద్దులూ ఒణికే గొంతుతో పాడతదంట!

ఇవన్నీ చూసి చూసి డాక్టరల్లుడికి బుర్ర చెడిపోయి అసలు టి.వి నే తీసి దిబ్బలో పారెయ్యమన్నాడంట. పాపం డాక్టర్ కూతురు తీసుకొచ్చి వాళ్ళ నాయన దగ్గరే వదేసింది!" అంది లక్ష్మి పకపక నవ్వుతూ. అదే సమయంలో మా టి.వి.లో "మన స్వతంత్రయోధుల బాధలు" ప్రోగ్రాం ఆరంభం అయింది". "ఇంటర్వ్యూ చేసేవారు శ్రీ ఎమ్ టి. బేకూగారు" అంటూండగానే ఒక పాతికేళ్ళ యువకుడు ఒక తొంభై యేళ్ళ వృద్ధుణ్ణి భద్రంగా ఒక చెయ్యిపట్టుకుని నడిపించుకొంటూ అంతకు ముందే వేసుంచిన రెండు కుర్చీల వేపు నడిపించుకొస్తూంటే మరొక చేతిలో వెండి పొన్నువేసిన కర్రవూతంగా బోసినోరు కదిలిస్తూ కంటిజోడు వుండీగూడా దృష్టి సరిగాలేని దూర్వాసయ్యను ఎలాగో ఎమ్. టి. బేకూగారు ముందున్న కుర్చీలో కూలేశాడు."

ఎదురుగా వున్న కుర్చీలలో తన షర్టూ, క్రాపూ సరిచేసుకుని దూర్వాసయ్యను ఇంటర్వ్యూ చేయడానికి లేని చిరునవ్వు తెచ్చుకుని కూర్చున్నాడు.

శ్రీ దూర్వాసయ్యగారు జైలుకెళ్ళి ఎన్ని అగచాట్లు పడ్డదీ. తనతో కూడా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులు ఎందరు గతించిందీ. తనతోబాటు ఎందరు మిగిలిందీ. వారు ఏం సాధించిందీ. వగైరా విషయాలు "యింటర్వ్యూ" చేయడానికి పదిహేను నిమిషాల టైము యివ్వబడ్డది. ఒకసారి బేకూగారు వాచీ చూసుకున్నారు. ముసలాయన్ని కూర్చోబెట్టడానికి మూడు నిమిషాలయింది.... మిగిలింది పన్నెండు



నిమిషాలు రేడియోలోగానీ. టి.వి.లో గానీ "టైమ్" ప్రకారం ప్రోగ్రాం నడిచిపోవాల్సిందే. అది రామాయణమైనా యిచ్చిన పదిహేను నిమిషాల్లో చెప్పాల్సిందే. భారతమైనా ఆ పదిహేను నిమిషాల్లోనే ముగించాలి.

తాంభై ఏండ్ల వృద్ధుడు దూర్వాసయ్య తన యాభై యేండ్ల స్వాతంత్ర సమరం పదిహేను నిమిషాల్లో చెప్పి ముగించాలనే విషయం తెలిసి వచ్చాడో లేక తెలీక వచ్చాడో గాని మొత్తానికి తనకు అంత ముఖ్యత్వం యిచ్చి టి. వి.లో తను అందరికీ కనిపించి. తన అనుభవాలు అందరికీ వినిపించి. యీనాటి యువతరాన్ని మేలు కొలిపానే పిచ్చి సంతోషంతో తనకిచ్చిన కుర్చీలో ఠీవిగా కర్ర పట్టుకుని కూర్చు న్నాడు!

"అయ్యా! దూర్వాసయ్యగారూ! నమస్కారం!" అన్నాడు ఇంటర్వ్యూ చేసే బేకూగారు! "నమస్కారం!" అన్నాడు బోసినోరు ఆడిస్తూ దూర్వాసయ్య.

"అయ్యా తమరు స్వాతంత్ర పోరాటం సలిపారు గదా ఆ కాలంలో బ్రిటిష్‌వారు!" అని బేకూగారు ముగించకముందే దూర్వాసయ్య కోపంతో ఛడాల్న చేతి కర్రతో నేల మీద ఒక్కపోటు పొడిచి "నోర్మూయ్ వాళ్ళ పేర్నాదగ్గరెత్తక! దుర్మార్గులు!"

"నా పెళ్ళాం పిల్లల్ని చెట్టుకీ పుట్టకీ తరిమి. మా ఆస్తంతా తగలేసి. మమ్మల్ని జైళ్ళల్లోకి తోసి నానా చిత్రహింసలూ పెట్టారు. మా గడ్డి మాకు తినిపించారు!" అంటూ ఆవేశంతో ఒక్కోమాటకూ చేతి కర్రతో నేలమీద గట్టిగా ఒక్కోపోటు పొడుస్తూ రెచ్చిపోతున్న దూర్వాసయ్యను ఆపడానికి యువకుడు బేకూ ఎంతో ప్రయత్నించి యిక లాభంలేదని చటుక్కున దూర్వాసయ్య చేతికర్ర లాక్కున్నాడు!... దాంతో మరికాస్త ఉగ్రుడైన దూర్వాసయ్య "యిదుగో యీ తప్పుడు పనే ఆనాడు బ్రిటిష్‌వాళ్లూ చేసారు !.... మా చేతుల్లో కర్రలుంటే అవీ లాక్కొని మమల్ని నిరాయుధుల్ని చేశారు! తుపాకుల్తో కాల్చారు! ఆ కర్ర నా దేశ సేవకు మెచ్చి యిచ్చింది! మామూలు కర్రగాదు! చందనం కర్ర. వెండి పొన్ను వేషిచ్చారు! ఆ కర్ర లాక్కుంటావేం! యిందుకా నన్నిక్కడికి పిల్చింది!" యింటర్వ్యూ చేసే యువకుడు బేకూకి ముచ్చెమటలు పోశాయి. గాభరాతో అటూ యిటూ చూసి. "అయ్యా! మీ కర్ర మేం తీసుకోం! యిది బ్రిటిష్ వారి తుపాకీ కంటే గొప్పది! అలాంటి మీ అమూల్యమైన చేతి కర్రను తాకే భాగ్యం నాకు యీనాడు కలిగినందుకు ఆనందిస్తున్నాను." అంటూ కోపం దిగమింగుకుని భక్తి ప్రదర్శిస్తూ కర్రను దూర్వాసయ్య చేతికిచ్చి ఒక సారి దొంగ చాటుగా టైము చూసుకుని అప్పటికే పదినిమిషాలయిపోయినందువల్ల యిక లాభంలేదని దూర్వాసయ్యకు కాస్త దగ్గరగా కుర్చీ లాక్కుని "అయ్యా మన దేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత తమ అనుభవాలు చెప్పగల్రా!" అన్నాడు బేకూ- ఆ మాట విన్న దూర్వాసయ్య కోపంతో అగ్గిబరాటా అయిపోతూ "ఎవరయ్యా నువ్వు! నేనింకా జైల్లోంచి బైటకి రాందే అప్పుడే స్వతంత్రం ఎట్లా వస్తుందయ్యా!"

యువకుడు బేకూ పరిస్థితి విషమించింది: "అయ్యా." అని ఇంటర్వ్యూ చేసే బేకూ ఏదో అడగబోయాడు! మధ్యలోనే దూర్వాసయ్య 'కట్' చేసి "అయ్యా లేదు కొయ్యా లేదు! ఊరుకోవయ్యా! యాభయి ఏండ్ల నాటి గాథ ఒక్క ముక్కలో చెప్పమంటే ఎట్లా! నేను జైల్లో ఉన్న రోజుల్లో"- టైమ్ అయిపోతోంది బేకూ ఓపిక నశించింది!

"అయ్యా! మీరు జైల్లోంచి వచ్చిన తర్వాత సంగతి చెప్పండి!"

మళ్ళీ దూర్వాసయ్యకి ఛర్రున కోపం వచ్చి కర్ర నేలకేసి బలంగా కొడుతూ "నేనింకా జైల్లోంచి రాందే వచ్చింతర్వాత చెప్పమంటావేంటయ్యా!.... పైగా ఒకసారా జైలుకెళ్ళాను! ...ఎన్నిసార్లో నాకే గుర్తులేదు! యాభై యేండ్ల నాటి చరిత్ర నన్ను గుర్తుచేసుకోని చెప్పనివ్వు...." అంటూ అరిచాడు దూర్వాసయ్య.

అంతవరకూ దూర్వాసయ్య చేసే అవమానంతో లోపల్నుంచి పొంగుకొస్తున్న కోపాన్ని బలవంతంగా అణుచుకోడంతో బాగా హీటెక్కిపోయిన బేకూ చివరిసారిగా మళ్ళీ బలవంతంగా చిరునవ్వు తెచ్చుకొంటూ "అయ్యా! మనకు టైము యింకా రెండు నిమిషాలే వుంది. తమరు జైల్లో


## చేతనా ధ్వని

ప్రకృతి భామిని
ప్రణయ కామిని
చివురు మోవిని
విరిసె ఆమని!!
చైత్ర సారథి
ఎక్కబెట్టిన
చెఱకు వింటిని
రసిక సుమములు!!

కన్నె గుండెల
విరుల బాటలు
కొత్త జంటల
మరుల తేటలు!!

బ్రతుకు వెలుగులు
కోయిలమ్మవి
చేదు చూపులు
వేప కొమ్మవి!!
ఆత్మలందున
అమృత వాహిని
అణుపు అణువున
చేతనా ధ్వని!!

—ఆచార్య తిరుమల



వుండి ఎన్నో బాధలూ కష్టాలూ పడ్డారు! దేశంకోసం ఎంతో త్యాగం చేశారు! దాని ఫలితంగానే మన భారతదేశం ఈనాడు యింత ఉన్నత స్థితిలో వున్నది। తమరు జైల్లోంచి వచ్చిన తర్వాత. మనకు స్వాతంత్రం వచ్చిన తర్వాత. తమరెక్కడున్నారు!"

"యిదుగో! నీ ఎదురుగా వున్నాను!" అన్నాడు ఒళ్లుమండిన దూర్వాసయ్య. అది విన్న బేకూ ఒక్కసారి ఖంగుతిని అది కప్పిపుచ్చుకోడానికి వెలవెలబోతున్న మొఖంతో పక పక నవ్వి "అయ్యా! మీరు భలే జోక్ చేస్తారు!"


"అవును!జోకే మరీ! రెండు నిమిషాల్లో నేను జైల్లోంచి బయటికొచ్చి దేశానికి స్వతంత్రం కూడా తెచ్చి పెట్టాను గదా ఈ టి.వి.లో. జోకవద్దూ!" బేకూ మొఖం మళ్ళీ వెలవెలబోయింది. టైమ్ చూసుకున్నాడు. పక్కకి చూశాడు. టి.వి. వాళ్ళ టైమ్ అయిపోయింది. యిక స్టాప్ అన్నట్లు సౌంజ్ఞచేసినట్లున్నారు. అది గమనించని దూర్వాసయ్య మళ్ళీ తన ధోరణిలో మొదలెట్టాడు "అప్పట్లో నేను జైల్లో వుంగగా...."

"అయ్యా దూర్వాసయ్యా!మీరుజైల్లోనే వుండండి: మనకిచ్చిన టైమయిపోయింది. నమస్కారం"అంటూ చివాల్న లేచాడు బేకూ బ్రతుకుజీవుడా అని. దూర్వాసయ్య చిరాగ్గాచూసి నోటితో గొణుగుతూ. "యీ మాత్రందానికి నన్నెందుకు యింత దూరం పిలవడం! అదేదో మీరే చెప్పి ఏడవొచ్చుగా!-"అంటూ చేతి కర్ర సహాయంతో లేవబోతూంటే టక్కున సీను మారి అనౌన్సర్ పిల్ల నవ్వుతూ కనిపించింది తర్వాతకార్యక్రమం చెప్పడానికి:

"మళ్ళీ స్వతంత్రయోధుల బాధలు ఎల్లుండి ఇదే సమయానికి మీరు చూడవచ్చు! మా తదుపరి కార్యక్రమం 'పాలు—చేలు'. ఆ తర్వాత కార్యక్రమం పల్లెటూళ్ళలో అక్షరజ్ఞానంలేని వారికి వృద్ధులకూ ఓనమాలు నేర్పించడం: నిర్వహించేవారు శ్రీ ఓనమాలరావుగారు: ఆ తర్వాత కార్యక్రమం జానపదగీతాలూ, సుద్దులూ శ్రీమతి సుబ్బారాయమ్మగారు పాడతారు! ఆ తర్వాత కార్యక్రమం".... టక్కున టి.వి. ఆఫ్ చేశాను,....

అంతసేపూ నా వెనకాలే నిలబడి టి.వి. చూస్తున్న పూలలక్ష్మి పకపక నవ్వుతూ 'చూశారామ్మా! ఒకటే బోర్ గా వుండ్లా! ఒక పాటాలేదు. పద్యంలేదు! వారానికొకసారి వేస్తారు సినిమాలూ పాటలూ. దానికోసంవాగంఅంతాయీబోరుచూస్తావుండాల. యిందుకే ఆ డాక్టరల్లుడుకి పిచ్చెత్తి టి.వి. తెచ్చి మామగారికి తిరిగిచ్చాడు!" అంటూ మళ్ళీ పూలలక్ష్మి పకపక నవ్వుతూంటే మా పనివాళ్ళూ దాంతో జతయ్యారు. నేనూ వాళ్ళతో మెల్లిగా శృతికలిపి నవ్వుతూ. "మంచిపని చేశాడు" అని నాలో నేనే గొణిగాను!

చిటుకులు :



## సిల్కు సుత్తి

నవ్వుల సభలో వక్తగదా
నవ్విస్తాడనిపోతే ఆ బీర్ బల్
మెత్తమెత్తగా హిందీలో గంట
సుత్తి కొట్టాడు- ఉత్త బోర్ బల్!

—భండారు పర్వతాలరావు

మీకు సంతానం కావాలా



ఆపరేషను, ఇతరవైద్య చికిత్సలతో నిరాశచెందిన సోదర, సోదరీమణులు అనేకులు మాసలహాలచే సంతానవంతులయి ఇచ్చిన యోగ్యతా పత్రములు కలవు.

—— వివరములు ఉచితం ——

పోస్టుద్వారా చికిత్స గలదు. ఈమాసములో స్వయముగా సంప్రదించుటకు

గురువారం, ఆదివారం — తెనాలి.. మ॥గం. 12-00 నుండి సా॥గం. 5-00 వరకు
మంగళవారం, బుధవారం, శనివారం — విజయవాడ.. మ॥గం. 12-00 నుండి సా॥గం. 5-00 వరకు

శ్రీ నాగార్జున మూలికా కుటీరం
రైల్వేస్టేషను వద్ద, రామాలయం వీధి, తెనాలి 522202.
2వ లైను, కేదారేశ్వరపేట, విజయవాడ-520003.

వాల్మీకి రామాయణము
రచన: ఉప్పల వేంకట రంగాచార్యులు.



ఆదికవి వాల్మీకి దివ్యదృష్టితో రచించిన రామాయణం శ్రీ వాల్మీకి రామాయణంగా అంతటా పేరు పొందింది. వేదవేద్యుడైన శ్రీమహావిష్ణువు అసురసంహారము నకై దశరథ నందనుడుగా పుట్టి మానవ ఆదర్శ అవతారుడైనాడు. వచన రామాయణంగా మాముందు 8 భాగములుగా వెలువడినది. మూడురంగుల ముఖచిత్రం.

కంబైన్డ్ 2 భాగములుగా రు.140/-లు * 8 విడిభాగములు రు.130/-లు

అడ్వాన్సు లేనిదే ఆర్డరు పంపబడదు. పోస్టేజి అదనం.

బాల సరస్వతీ బుక్ డిపో
శ్రీ టి. వెంకటేశ్వర్లు శెట్టి ఛాంబర్స్
నెం-4. నంబూరాయు శెట్టి వీధి మద్రాసు-600001
Phones: 29868